క్లుప్తంగా

కేంద్రం చేయూత అభినందనీయం

రేపల్లె రూరల్: నష్టాలలో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేయూత ఇవ్వడం అభినందనీయం అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. అనంతరం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. సమావేశంలో కృష్ణా పశ్చిమ డెల్టా కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, దండుప్రోలు పిచ్చియ్య, దండుప్రోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



నిజాంపట్నం: గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని రేపల్లె డీఎస్పీ ఆవుల సాంబశివరావు అన్నారు. ముత్తుపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా ఉంటే సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ కందుల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై గ్రామ సభ



వరహాపురం(వేమూరు): భూముల రీ సర్వే కోసం ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర అన్నారు. వరహాపురంలో దీనికి సంబంధించి గ్రామసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ విడత సర్వే కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ సర్పంచ్ యల్లమాటి స్వాతి, పంచాయతీ కార్యదర్శి గోపాల కృష్ణ రైతులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బాపట్ల: బాపట్ల పట్టణంలోని భావన్నారాయణస్వామి దేవాలయం వద్ద ఓ లాడ్జిలో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బాపట్ల ఏరియా ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. తెనాలి నియోజకవర్గం దుగ్గిరాల ప్రాంతానికి చెందిన సింగర పాటి మురళీకృష్ణ (28) తన భార్యతో కలిసి శుక్రవారం సాయంత్రం బాపట్ల పట్టణంలోని భావన్నారాయణ స్వామి గుడి ప్రాంతంలోని ఓ లాడ్జిలో దిగారు. శనివారం తెల్లవారుజామున మురళీకృష్ణ పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన భార్య చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించటంతో వైద్యులు గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. వైద్యశాల ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు. చికిత్స పొందుతూ మురళీకృష్ణ మృతి చెందాడు.

అక్షరాస్యత పెంపు కీలకం



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి అక్షరాస్యులను చెయ్యాలని పిట్టలవానిపాలెం మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌డీవో చెరుకూరి విజయలక్ష్మి చెప్పారు. పిట్టలవానిపాలెం వెలుగు కార్యాలయంలో శనివారం ఉల్లాస్(వయోజన విద్య) కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా డీఎల్‌డీవో మాట్లాడారు. ఏపీఎం సంతోష్‌కుమార్, ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, వయోజన విద్య కోఆర్డినేటర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



అమర్తలూరు(వేమూరు): నవోదయ ఎంట్రన్స్ పరీక్ష జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శనివారం ప్రశాంతంగా జరిగింది. ప్రధానోపాధ్యాయుడు కనపర్తి నిరీక్షణరావు మాట్లాడుతూ.. 37 మందికిగాను 32 మంది రాశారన్నారు. పరీక్ష కేంద్రాన్ని డ్వామా పి.డి. విజయలక్ష్మి పరిశీలించారు.

‘లెక్క’ కోసమే పక్కాగా ‘ప్రణాళిక’లు!

- భవన నిర్మాణాలకు సకాలంలో రాని అనుమతులు
- అధికారుల మౌఖిక ఆదేశాలతో నిర్మాణ రంగం కుదేలు

పట్టణ ప్రణాళికా విభాగం తాము చెప్పే వరకు ఆన్‌లైన్‌లో భవనాల అనుమతులకు దరఖాస్తు నమోదు చేయొద్దంటూ అనధికారికంగా మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ‘లెక్క’ కోసం పక్కా ప్రణాళికలతో భవనాల అనుమతి నిలిచిపోయింది. ఇటు భవనాల అనుమతులు రాక యజమానులు.. అటు లైసెన్స్‌డ్ సర్వేయర్లు తలలు పట్టుకుని కూర్చున్నారు. గత ప్రభుత్వం భవన నిర్మాణాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే అన్ని పత్రాలు పరిశీలించి సక్రమంగా ఉంటే వెంటనే అనుమతులు ఇచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక అనుమతులకు బ్రేక్‌లు వేసింది. భవన నిర్మాణరంగానికి చుక్కలు చూపిస్తోంది.

బాపట్ల బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె పట్టణాల్లో వందల సంఖ్యలో భవన నిర్మాణాల అనుమతులు నిలిచిపోయాయి. అనుమతులు ఇవ్వాలంటే తమ వాటా ఏంటో తేల్చి చెప్పాలంటూ కొంతమంది అధికారులు భీష్మించుకుని కూర్చొంటున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతిసారీ ఈ లెక్క తేలేవరకు వదలడం లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేయొద్దని తేగేసి చెప్పటంతో చేసేది లేక అనుమతులు ఫైల్స్ పక్కనబెట్టారు.

ఇది అసలు పద్ధతి...

ఒక ఇంటి యజమాని తాను నిర్మించుకోవాలన్నా, వాణిజ్య సముదాయం, హాస్టల్స్, అపార్టుమెంట్లు నిర్మించుకోవాలంటే మున్సిపాలిటీలోని పట్టణ ప్రణాళికా విభాగం నుంచి అనుమతులు తీసుకోవాలి. ఈ మేరకు లైసెన్స్‌డ్ సర్వేయర్లును సంప్రదిస్తే వారు ప్లాన్ గీయటంతోపాటు మున్సిపాలిటీలో ఎంత చలానా రూపంలో చెల్లించాలో చెప్పి ఆన్‌లైన్ దరఖాస్తు చేయిస్తారు. ఈ మేరకు స్థలానికి సంబంధించిన రికార్డులు, వాణిజ్య సముదాయం, అపార్టుమెంటు అయితే పక్కన నివాసం ఉండే వారి నుంచి అభ్యంతరాలు లేవు అనే ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల స్థాయి ఆధారంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలో కొన్ని భవనాలకు, మరికొన్నింటికి గుంటూరులోని రీజనల్



బాపట్ల మున్సిపల్ కార్యాలయం

డైరెక్టర్ (టౌన్‌ప్లానింగ్) నుంచి అనుమతుల పొందాల్సి వస్తోంది. ఇలా అనుమతులు తీసుకుని మాత్రమే భవనాల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది.

చిక్కు ఇలా వచ్చింది...

గత ప్రభుత్వంలో స్థలానికి సంబంధించి పత్రాలు, చలానా చెల్లింపులు, ప్లాన్ ఉంటే వెంటనే అనుమతులు ఆన్‌లైన్ ద్వారా ఇచ్చేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ముడుపులు కోసమే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టొదని తేల్చిచెప్పారు. దీంతో వందల సంఖ్యలో ఉండాల్సిన దరఖాస్తులు పదుల సంఖ్యలో ఉన్నాయి. బాపట్ల మున్సిపాలిటీలో 150కిపైగా దరఖాస్తులు ఉండగా.. కేవలం 11 భవనాలకే అనుమతులు ఇచ్చారు. ఇంకా దరఖాస్తు కోసం సిద్ధంగా 450కిపైగానే ఉన్నాయి. రేపల్లెలో కేవలం 23 మాత్రమే దరఖాస్తులు రాగా.. వాటిలో 16 భవనాలకు అనుమతులు ఇచ్చారు. చీరాల మున్సిపాలిటీలో 70కిపైగా దరఖాస్తులు ఉండగా.. 31 భవనాలకు మాత్రమే అనుమతి వచ్చింది. అద్దంకి మున్సిపాలిటీలో దరఖాస్తుల సంఖ్య పదుల సంఖ్యలో మాత్రమే ఉంది.

స్తంభించిన నిర్మాణ రంగం

అనుమతులు రాకుండా నిర్మాణం చేపడితే మున్సిపాలిటీ నుంచి ఇబ్బందులు వస్తాయని భావించిన యజమానులు పనులు చేపట్టకుండా ఖాళీగా ఉండిపోయారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. భవన నిర్మాణం నిలిచిపోవటంతో కార్మికులు కూడా పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని అనుమతులు ఇవ్వాలని యజమానులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



వేమూరులో ర్యాలీలో ఎమ్మెల్యే ఆనందబాబు తదితరులు



కర్లపాలెం బస్టాండును శుభ్రం చేస్తున్న ఎంపీపీ వనజ, ఎంపీడీవో శ్రీనివాసరావు



అమర్తలూరు కార్యక్రమంలో ఎంపీడీవో మారుతీ శేషామాంబ

రేపల్లె రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛత దివస్‌ను పురస్కరించుకుని మార్కెట్ సెంటరులో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం రహదారులు శుభ్రపరిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాలూకా నుంచి మార్కెట్ సెంటరు మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, కమిషనర్ కాకర్ల సాంబశివరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం.శోభారాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

నగరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని చినమట్లపూడి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

చెరుకుపల్లి: గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం మెరుగు పరచాలని తహసీల్దార్ సీహెచ్ పద్మావతి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులను అధికారులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కేజీఏ శ్రీనివాసన్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేమూరు: మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమ ర్యాలీలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు అందరూ సహకరించాలని కోరారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, అమ్మిశెట్టి కిషోర్, తహసీల్దారు సుశీల, ఎంపీడీవో శివన్నారాయణ పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో మారుతీ శేషామాంబ అన్నారు. ప్రతి నెల మూడవ శనివారం అధికారులు ఈ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. తహసీల్దారు నెహ్రూ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కర్లపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన అంటువ్యాధులను నివారించుకోవచ్చునని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిషత్ కార్యాలయం నుంచి కర్లపాలెం ఐలాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బస్టాండ్‌ను ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డితో కలిసి ఎంపీడీవో శుభ్రపరిచారు. కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గోపీనాథ్, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, పీఆర్ఏఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వసుధ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



రేపల్లెలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి



భట్టిప్రోలులో మానవ హారం నిర్వహిస్తున్న దృశ్యం



చెరుకుపల్లిలో పారిశుద్ధ్య కార్యక్రమంలో అధికారులు

వైకుంఠపురంలో హరినామ సంకీర్తన గానం



సంకీర్తన బృందం గురువు వంశీకృష్ణకు సత్కారం

తెనాలి: స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన బృందంచే గీతాలాపన చేశారు. గురువు పెరవలి వంశీకృష్ణ శిష్య బృందంచే జరిగిన సంకీర్తన కార్యక్రమంలో ‘వేడుకొందామా వేంకటేశ్వరుని’, ‘మూడు నామాలవాడు ఏడుకొండలవాడు’, ‘అదిగో అల్లదిగో శ్రీహరివాసము’ అనే సంకీర్తనలను గానం చేసి భక్తులను పరవశులను చేశారు. ప్రోగ్రాం అసిస్టెంట్ ఈ.అమ్మడు గారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంకీర్తన అనంతరం బృంద గురువు పెరవలి వంశీకృష్ణను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.అనుపమ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో శేష వస్త్రాన్ని బహూకరించి సత్కరించారు. టీవీఎస్ శాస్త్రి, లక్ష్మీ నరసింహారావు, రాజు, అందె బాలచంద్రమౌళి, మాదల సాయిహనుమంతరావు, నందికంటి రామాంజనేయులు పాల్గొనగా సంకీర్తన బృందంలో మాదల నాగఅర్చన, అందె రాజేశ్వరి, తూనుగుంట్ల దుర్గామల్లేశ్వరి, కొప్పురవు అనిత మాధవి, దంటు శర్వాణి, నందికంటి జయలక్ష్మీ, శ్రీపూజిత, కొత్తమాసు పుష్పలత గానం చేయగా, కీబోర్డు వాయిద్య సహకారం నూతక్కి వెంకటేశ్వరరావు, శ్రీదివ్య అందజేశారు.

ఎన్టీఆర్‌కు నేతల నివాళులు



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి శనివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు నివాళి అర్పించారు. అనంతరం బాపట్ల ఏరియా వైద్యశాల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జనసేన నాయకులు శిమన్నారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షులు గొలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు: కొల్లూరు బస్టాండ్ సెంటర్లో, పోలీసు స్టేషను వద్ద ఎన్టీఆర్ చిత్ర పటానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నివాళులు అర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్, జనసేన మండలాధ్యక్షుడు బొందలపాటి చలమయ్య పాల్గొన్నారు.

భట్టిప్రోలులో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు టి. ఉదయభాస్కరి, టీడీపీ నాయకులు తూనుగుంట్ల సాయిబాబ, భట్టు మల్లికార్జునరావు, సూరిబాబు పాల్గొన్నారు.

కర్లపాలెం: టీడీపీ ఆధ్వర్యంలో పెదపులుగువారిపాలెం, నర్రావారిపాలెం, కర్లపాలెంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. టీడీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, నాయకులు పమిడి భాస్కరరావు, నక్కల వెంకటస్వామి, పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, పఠాన్ అహ్మద్ భాషా, ధనుంజయ్, ఎస్‌కె బాజీ, గుంపుల కన్నయ్య, బుల్లియ్య తదితరులు ఉన్నారు.

పివిపాలెంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు గ్లోరియానెట్, కాశిం, కిషోర్ రెడ్డి, వెంకటపతిరాజు నివాళులర్పించారు.

గోవా మద్యం ఆరోపణలపై ఆకస్మిక తనిఖీలు

- లారీ స్వాధీనం
- నాలుగు గంటల పాటు ఎక్సైజ్ అధికారుల పరిశీలన
- మద్యం లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్న వైనం



లారీ నుండి సోడా సీసాలను దించుతున్న సిబ్బంది

తెనాలిరూరల్: ఓ లారీ డ్రైవర్ క్వార్టరు మద్యం తాగడంతో ఎక్సైజ్ అధికారులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. నానా హైరానా పడుతూ నాలుగు గంటల పాటు వాహనాన్ని తనిఖీ చేయాల్సి వచ్చింది. గుంటూరు నుండి సైతం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు వచ్చి వాహనాన్ని స్వయంగా తనిఖీ చేశారు. చివరకు ఏ అక్రమం జరగలేదని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గోవా నుంచి తెనాలికి వచ్చిన ఓ లారీలో భారీగా మద్యం బాటిళ్లు ఉన్నాయంటూ శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన ఎక్సైజ్ అధికారులు ఈ అనుమానాలకు తావిస్తున్నట్లుగానే స్థానిక సుల్తానాబాద్ శివారులో శుక్రవారం ఉదయం నుండి రోడ్డు పక్కన లారీ ఆపి ఉండటాన్ని గుర్తించారు. భారీ లోడ్‌తో ఉన్న లారీ రోడ్డు పక్కన ఎందుకు ఆపి ఉంచారంటూ అనుమానం వచ్చిన అధికారులు తనిఖీలు చేశారు. లారీ పట్టణ గంగానమ్మపేటలోని ఓ కూల్‌డ్రింక్ హోల్‌సేల్ డీలరుకు గోవా నుండి ప్రముఖ కంపెనీ సోడా బాటిళ్లు తీసుకు వచ్చినట్లు డ్రైవర్ చెప్పడంతో అధికారులు లారీని గంగనమ్మపేటలోని డీలర్ గోడౌన్ వద్దకు తీసుకువచ్చారు. గుంటూరు నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ మారయ్యబాబు, తెనాలి ఇన్‌చార్జ్ సీఐ అనూరాధ దేవి, సీఐ నయనతార, తెనాలి ఎక్సైజ్ ఎస్ఐ ఫణికుమార్ లు లారీని క్షుణ్ణంగా తనిఖీ చేసి అందులో ఉన్న లోడ్‌ను దింపించారు. అర్ధరాత్రి వరకు అన్‌లోడ్ ప్రక్రియ కొనసాగగా చివరికి అందులో కేవలం ఓ ఎంఎన్‌సీ కంపెనీకి చెందిన సోడా సీసాలు మాత్రమే ఉండటాన్ని గుర్తించారు. మొత్తం 1200 కేసుల సోడా సీసాలు లారీలో గోవా నుండి తెనాలి వచ్చాయి. చివరికి లారీలో మద్యం సీసాలు లేవని నిర్ధారించారు. దీనిపై ఏఈఎస్ మారయ్యబాబు మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు లారీని తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఉదయం వేళల్లో లారీ పట్టణంలోకి రావడానికి అనుమతి లేకపోవడంతో డ్రైవర్ సుల్తానాబాద్ వద్ద ఆపి ఉంచాడని చెప్పారు. లారీలో బాటిల్స్ మినహా ఎటువంటి మద్యం గుర్తించలేదన్నారు.కాగా లారీని పట్టణ శివారులో నిలిపి ఉన్న సమయంలో దాని డ్రైవరు సమీపంలోని మద్యం దుకాణానికి వెళ్లి క్వార్టరు మద్యం తీసుకుని తాగి లారీ వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న ఇతర లారీ డ్రైవర్లు, స్థానికులతో మాటల్లో అతను గోవా నుంచి సరుకు తీసుకుని వచ్చానని చెప్పడంతో అక్రమంగా గోవా మద్యం తీసుకువచ్చాడన్న ప్రచారం జరగడంతో అధికారులు నానా హైరానా పడాల్సి వచ్చింది.

హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ

బాపట్ల: హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలలో ప్రాణాలకు రక్షణ ఉంటుందని ఆర్‌టీవో టి.కె.పరంధామరెడ్డి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మసోత్సవాల్లో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల నుంచి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ డి. రంగారావు, కె. ప్రసన్నకుమారి, టౌన్ సీఐ బాబు, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు పాల్గొన్నారు.



భద్రతా మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ చేపట్టిన పోలీసులు

హెల్మెట్ వాడకం తప్పనిసరి

తెనాలిరూరల్: ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వాడాలని తెనాలి మోటా రు వాహన ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు సూచించారు. రహదారి భద్రతా మాసోత్స వాల్లో భాగంగా ద్విచక్రవాహనదారులకు శనివారం స్థానిక మార్కెట్ యార్డులో హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాఘవరావు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపే వారికి రూ. వెయ్యి జరిమానా విధిస్తామని చెప్పారు. 100 మంది రోడ్డు ప్రమాదాల బారిన పడితే అందులో 30 మంది మరణిస్తున్నరని, వీరిలో 18 మంది హెల్మెట్ లేని కారణంగా మరణిస్తున్నా రని తెలిపారు. ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్‌లనే వినియోగించాలని సూచించారు.

హంస వాహనంపై సాయిబాబా ఊరేగింపు

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలోని సాయినాథుని సత్సంగ కేంద్రం 33వ వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ఆరంభించారు. రెండురోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా సాయంత్రం 6.30 గంటలకు సత్సంగ కేంద్రం నుంచి సాయిబాబా, శరత్ బాబూజీ ఉత్సవమూర్తులను విద్యుద్దీపాలతో అలంకరించిన హంస వాహనంపై పట్టణంలో ఊరేగింపు జరిపారు. వివిధ వాయిద్యాలు, గురుదేవుల నామ సంకీర్తనలతో భక్తులు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. సృజన ఆధ్వర్యంలో శ్రీదుర్గమ్మ తల్లి కోలాట కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పురవీధుల్లో ఊరేగింపుగా రాత్రి 9.30 గంటలకు బుర్రిపాలెంరోడ్డులోని టీజీకే కళ్యాణమండపానికి చేరుకుంది. బాబా గురుదేవులకు అక్కడ ఏర్పాటుచేసిన ‘లెండివనము’లో నివేదన, హారతి సమర్పించాక, ప్రసాద వినియోగం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 1992లో స్థాపించిన సాయినాథుని సత్సంగ కేంద్రానికి సాయినాథుని శరత్‌బాబూజీ స్వయంగా సాయిబాబా ఫోటోను స్వహస్తాలతో అందించినట్టు కన్వీనర్ వీజే నాగభూషణరెడ్డి తెలిపారు. వ్యవస్థాపకుడు జి.సాయివరప్రసాద్, ఎం.నరసింహారావు సత్సంగ కేంద్రానికి విలువైన సేవలు చేసినట్టు చెప్పారు. 19వ తేదీ ఉత్సవ కార్యక్రమాలు ఉదయం ఏడు గంటలంచి సాయంత్రం అయిదు గంటల వరకు జరుగుతాయని వివరించారు.



పురవీధుల్లో ఊరేగింపు

హిజ్రాలకు సన్మానం

వేమూరు: వైఎస్సార్‌సీపీ పదవిలో హిజ్రాలకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. చెరుకుపల్లి గ్రామంలో ఆయన స్వగృహంలో హిజ్రాలకు శనివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో హిజ్రాలకు రాజకీయంగా ప్రత్యేక స్థానం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

హాకీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఐలవరం విద్యార్థి



భట్టిప్రోలు (కొల్లూరు) : హాకీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఐలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయుడు మాచర్ల మోహన్‌రావు శనివారం తెలిపారు. చెరువిజమ్ములపాలెంలో జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో ప్రతిభ చాటిన 9వ తరగతి విద్యార్థి పిట్టు విజయకుమార్ రెడ్డి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు తుమ్మా శ్రీనివాస రెడ్డి, విజయకుమార్ రెడ్డిని సర్పంచి మాచర్ల కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు తెనాలిలో అగ్నిబాధిత పసుపు రైతుల ధర్నా

తెనాలి: దుగ్గిరాలలోని శుభమ్ మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో అగ్నిప్రమాదం సంభవించి ఏడాది గడచినా తమ కు న్యాయం జరగనందుకు నిరసనగా ‘సాంవత్సరీకం’ సందర్భంగా ఈనెల 20న తెనాలి మారీసుపేటలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ వద్ద బాధిత పసుపు రైతులు ధర్నా చేయనున్నారు. అగ్నిబాధిత పసుపు రైతుల సంఘం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి శనివారం మాగంటి యల్ల మందతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. గత సంవత్సరం జనవరి 19న కోల్డ్‌స్టోరేజీలో 400 మంది రైతులకు చెందిన దాదాపు రూ.100 కోట్ల పసుపు దగ్ధమైందని గుర్తుచేశారు. గత జులై 10వ తేదీన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి క్వింటాలుకు రూ.7,000 చొప్పున పరిహారం ఇప్పిస్తానని హామీనిచ్చినట్టు చెప్పారు. ఇన్సూరెన్స్ అధికారులు క్లెయిములను పరిశీలించి, పరిష్కరించనందుకు, పసుపు రైతులకు న్యాయం జరగనందుకు నిరసనగా ధర్నాకు నిర్ణయించినట్టు తెలిపారు. మారీసుపేటలోని గవిని వెంకటేశ్వరరావు ఆస్పత్రి దగ్గర్లోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ వద్ద ఉదయం 10.30 గంటలకు ధర్నా చేపడతామని వివరించారు. బాధిత పసుపు రైతులందరూ ధర్నాలో పాల్గొనాలని కోరారు.